



జిల్లా పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నేతల నివాళులు

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. మండల, నియోజకవర్గ పార్టీ కార్యాలయాలు, ఇతర ప్రాంతాల్లోనూ ఎన్టీఆర్ విగ్రహాలు.. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. పలుచోట్ల పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. చిత్తూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు గురజాల జగన్మోహన్, దగ్గుమళ్ల ప్రసాదరావు, నేతలు సురేంద్రకుమార్, కటారి హేమలత, చంద్రప్రకాష్, వైవీ రాజేశ్వరి, త్యాగరాజన్, మోహన్‌రాజ్, మేషాక్, ఫైరోజ్, రాణి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- చిత్తూరు సిటీ

ఓటు వేస్తాం.. వేయిస్తాం



'మేము ఓటు వేస్తాం.. అందరి చేతా వేయిస్తాం' అంటూ యువత నినదించింది. ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్వీప్ టీమ్ చిత్తూరు నగరంలోని రుక్మిణి క్రిష్ణస్వామి జూనియర్, డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ప్రత్యేక స్పోర్ట్స్ క్యాంపు నిర్వహించి కొత్తగా ఓటు హక్కును నమోదు చేసుకున్న 110 మంది విద్యార్థులు ఈ క్యాంపులో పాల్గొనారు. ఓటు హక్కుపై వీరంతా అవగాహన కల్పించారు. వీరికి షాట్‌పుట్, వాలీబాల్, షటిల్, కబడ్డీ వంటి పోటీలను నిర్వహించారు. యువ ఓటర్లు తమ ఓటుహక్కును నిర్భయంగా, నిష్పక్షపాతంగా వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ రమేష్‌బాబు సూచించారు. స్వీప్ నోడల్ అధికారి చిన్నయ్య, సభ్యులు పాల్గొన్నారు.

- చిత్తూరు



కుప్పంలో ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవులు

శుభ శుక్రవారం

జిల్లాలో శుక్రవారం గుడ్ ఫ్రైడే (శుభ శుక్రవారం) కార్యక్రమాన్ని క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాపాలనుంచి దీనులను రక్షించడంకోసం శిలువ మోసి.. రక్తం చిందించి ఆత్మత్యాగం చేసిన ఏసు ప్రభువును గుర్తుతెచ్చే ప్రదర్శన.. పలుచోట్ల వీధుల గుండా సాగింది. మరణించిన యేసు తన కోసం పరితపించే జనంకోసం తిరిగి సమాధినుంచి లేచిన రోజునే గుడ్ ఫ్రైడేగా జరుపుకుంటారని పాస్టర్లు వివరించారు.

- కుప్పం




గొడ్డేరువంకలో జరిపిన ఇసుక తవ్వకాలు

'అధికారం' అండగా ఇసుకాసురులు బరితెగిస్తున్నారు. అభయారణ్యంలోని వాగులు, వంకల్లో ఇసుకను అక్రమంగా తవ్వి పక్కరాష్ట్రాలకు తరలించేస్తున్నారు. తమ అక్రమార్జనతో ఎదురు లేకుండా చూసుకుంటున్నారు. వీరికి అధికార పార్టీ మద్దతు ఉండటంతో అధికారులూ చూసీచూడనట్టు ఉండిపోతున్నారు.

- రామకుప్పం

బరితెగిస్తున్న ఇసుకాసురులు





- కౌండిన్య అభయారణ్యంలో యథేచ్ఛగా తవ్వకాలు
- సరిహద్దులు దాటిస్తున్నా పట్టించుకోని అధికారులు
- 'అధికారం' అండగా సాగుతున్న అక్రమ రవాణా

రామకుప్పం మండలంలో విస్తరించిన అభయారణ్యంలో వాగులు, వంకల్లో నాణ్యమైన ఇసుక నిల్వలున్నాయి. ఇక్కడి అటవీ ప్రాంతానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి.. అటవీసమీప రెండు గ్రామాలకు చెందిన ఇద్దరు నేతల కన్ను ఆ ఇసుకపై పడింది. వీరి ఆధ్వర్యంలో అటవీ లోతట్టు ప్రాంతంలో పగటిపూట ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. రాత్రిళు అడవిలో వారు ఏర్పాటు చేసుకున్న రోడ్ల గుండా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఆరు నెలలుగా ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా భారీ స్థాయిలో జరుగుతోంది. బందార్లపల్లె పంచాయతీ గడ్డూరు యానాదికాలనీ సమీపంలోని గొడ్డేటివంక, బడిమానువంక, సింగసముద్రం పెద్దవంక, ననియాల, నారాయణపురం అటవీప్రాంతాల్లో పలు వంకలు, వాగుల్లో కిలో మీటర్ల మేర రోడ్లు ఏర్పాటు చేసుకుని, యంత్రాలు, కూలీలచే ఇసుక తవ్వకాలు చేపట్టి రోజు పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుకను సరిహద్దులు దాటిస్తున్నారు. మొదట ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసమంటూ అటవీ అధికారుల మౌఖిక అనుమతులతో ఇసుక తవ్వకాలు జరిపిన వీరు.. ఆ తర్వాత అక్రమ రవాణాదారులుగా మారిపోయారు. స్థానిక అటవీశాఖలోని కొందరు అధికారులను, సిబ్బందిని నయానో, భయానో లోబర్చుకుని ఇసుక దందా సాగిస్తున్నట్లు విమర్శలున్నాయి. డబ్బుతో అధికారులను కట్టడి చేస్తున్నారని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా అడ్డు అదుపులేకుండా సాగిస్తున్న ఇసుక అక్రమ రవాణాతో ఓ నేత, ఓ ప్రజాప్రతినిధి కోటీశ్వరులయ్యారన్న ప్రచారం సాగుతోంది. ఈ లెక్కన రామకుప్పం అడవుల్లో ఏ స్థాయిలో ఇసుక దందా నడుస్తుందో అర్థం చేసుకోవచ్చు. గడ్డూరు యానాది కాలనీ సమీపంలోని గొడ్డేరువంక, బడిమానువంకల్లో సాగుతున్న ఇసుక దందాకు ఓ అధికారి మద్దతు ఉన్నట్లు తెలుస్తోంది. గతనెల 5వ తేది రాత్రి బడిమానువంకలో గ్రామస్థులు రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుంటే, ఆ అధికారి వచ్చిన వెంటనే వాటిని అక్రమరవాణాదారులు తీసుకెళ్లిపోవడమే దానికి నిదర్శనమని స్థానికులు అంటున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లినప్పుడో.. మీడియాలో కథనాలు వచ్చినప్పుడో ఒకట్రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకోవడం. జరిమానాలతో సరిపెడుతున్నారు. ఇక, అడవిలోకి వెళ్లేందుకు ఇసుకాసురులు ఏర్పాటు చేసుకున్నదారులను అధికారులు మూసివేస్తున్నారు. తిరిగి రెండు, మూడు రోజులకు వారే అక్రమార్కులకు సౌకర్యంగాఉండే దారులను దగ్గరుండి చూపుతున్నారనే విమర్శలున్నాయి. అందుకే ఇసుక అక్రమ రవాణాకు శాశ్వతంగా అడ్డుకట్ట పడటం లేదన్న వాదన ఉంది. అధికారులు మాత్రం ఇసుక అక్రమ రవాణా నిరోధానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని చెబుతుండటం గమనార్హం.



బడిమానువంకలో..

అడ్డుకున్న వారిపై దాడులు

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునే వారిపై ఇసుకాసురులు దాడులక దిగడం పరిపాటైంది. గతంలో సింగసముద్రంలో ఇసుక రవాణాను అడ్డుకున్న టీడీపీ శ్రేణులపై బూతులతో విరుచుకుపడుతూ బెదిరింపులకు దిగారు. నారాయణపురం అటవీప్రాంతంలో ఇసుక అక్రమరవాణాకు అంగీకరించకపోవడంతో ఒకటిన్నర ఏడాది క్రితం ఒకేసారి 9మంది అధికారులు బదిలీ వేటుకు గురయ్యారు. అంతకు ముందు ఇద్దరు అధికారులపై చేయి చేసుకున్నట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. తాజాగా గడ్డూరు బడిమానివంకలో ఇసుక అక్రమరవాణాను అడ్డుకున్న గ్రామస్థులపై అధికార పార్టీ ప్రజాప్రతినిధి అడవిమీ అబ్బ సొత్తా అంటూ అనుచరులతో కలిసి దాడికి పాల్పడ్డాడు.



ఇసుక తవ్వకాలకు అడ్డుగా ఉన్నాయని చెట్లనూ నరికేశారు



అడవిలో ఏర్పాటు చేసుకున్న రోడ్డు

ఒకటినుంచి టెన్త్ జవాబు పత్రాల మూల్యాంకనం

చిత్తూరు (సెంట్రల్), మార్చి 29: టెన్త్ పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఏప్రిల్ ఒకటి నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డీఈవో దేవరాజు, పరీక్షల సహాయ కమిషనర్ చాముండేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అన్ని సబ్జెక్టులకు సంబంధించి జవాబు పత్రాల మూల్యాంకనం జరుగుతుందన్నారు. దీనిపై ఉత్తర్వులు అందుకున్న చీఫ్ ఎగ్జామినర్స్, అసిస్టెంట్ ఎగ్జామినర్స్, స్పెషల్ అసిస్టెంట్లు ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల్లోపు డిప్యూటీ క్యాంపు అధికారి (డీవైఈవో, చిత్తూరు)కి రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. లేదంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు (సెంట్రల్), మార్చి 29: జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి ఆదివారం నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో దేవరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈపాఠశాలల్లో విద్యాభ్యాసానికి ఎలాంటి ఫీజులు వసూలు చేయబడవని స్పష్టం చేశారు. విద్యార్థులు దరఖాస్తు చేసుకున్న మండలం, పాఠశాలలోనే ఏప్రిల్ 21న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శనివారం): సా. 6.30

సహరి (ఆదివారం) : ఉ. 4.49

అదీ ఇదీ అడక్కు... ఇచ్చింది తీసుకో...!

- ఈసారి బియ్యం ఒక్కటే
- పంచదార అరకొరే
- కందిపప్పు, గోధుమ పిండి, రాగిపిండి నోస్టాక్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 29: నిత్యావసర వస్తువుల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. ఒక్కో వస్తువును కత్తిరిస్తూ.. ఏప్రిల్ నెలకు వచ్చేసరికి బియ్యం పంపిణీకే పరిమితం చేసింది. ఇస్తున్న పంచదార పూర్తిస్థాయి స్టాకు లేకపోవడంతో కొందరికి మాత్రమే ఇవ్వనున్నారు. జిల్లావ్యాప్తంగా 5.45 లక్షల రేషన్‌కార్డులుండగా, ఏప్రిల్ నెలకు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన ఉచిత బియ్యం మాత్రమే పూర్తిస్థాయిలో కార్డుదారులకు పంపిణీ చేస్తారు. కుటుంబంలోని ఒక్కొక్కరికి ఐదు కిలోల వంతున ఇవ్వనున్నారు. ఇక, కార్డుదారులకు 250 టన్నుల చక్కెర అవసరం కాగా, ప్రభుత్వం 125 టన్నులే కేటాయించింది. దాంతో మున్సిపాలిటీల్లోని కార్డుదారులకు మాత్రమే పంపిణీ చేస్తారు. రాగిపిండిని అందరికీ ఇస్తామని మార్చి నెలలో చెప్పి, అరకొర ఇచ్చారు. 545 టన్నులకు బదులు గతనెల 250 టన్నులు, గోధుమపిండి 545 టన్నులకు బదులు 150 టన్నులు మాత్రమే పంపిణీ చేశారు. ఏప్రిల్ నెలలో స్టాకులేకపోవడంతో గోధుమపిండి పంపిణీ కూడా ఆగింది. మరోవైపు కందిపప్పు పంపిణీ గత ఆగస్టు నుంచి ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో లబ్ధిదారులు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

- కానిస్టేబుల్ సహా తొమ్మిది మంది అరెస్టు, మరో ఇద్దరి పరారీ
- రూ.5.26 లక్షల నగదు స్వాధీనం

వెదురుకుప్పం, మార్చి 29: పేకాట స్థావరంపై కార్వేటినగరం పోలీసులు శుక్రవారం సాయంత్రం దాడులు జరిపారు. ఈ దాడుల్లో కానిస్టేబుల్ సహా తొమ్మిది మంది జూదరులను అరెస్టు చేశారు. ఈ వివరాలను కార్వేటినగరం సీఐ సత్యబాబు మీడియాకు తెలియజేశారు. పోలీసులకు వచ్చిన ముందస్తు సమాచారంతో కార్వేటినగరం ఎస్‌ఐ వెంకటకృష్ణ తమ సిబ్బందితో శుక్రవారం సాయంత్రం జూద స్థావరంపై దాడి చేశారు. కార్వేటినగరం మండలం బట్టువారిపల్లి సమీపంలో ఓ మామిడి తోటలో మంగతాయారు(లోపల-బయట) జూదమాడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పరారయ్యారు. జూదరుల నుంచి 5,26,330 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. 11 సెల్ ఫోన్లు, ఒక బైక్‌ను సీజ్ చేశారు. జూదంలో పట్టుబడిన వారిలో తమిళనాడుకు చెందిన ఆరుగురు, ఆంధ్రాకు చెందిన ముగ్గురు ఉన్నారు. ఈ తొమ్మిది మందిలో తిరుపతి నగరం ముత్యాలరెడ్డిపల్లి పోలీసుస్టేషన్‌లో ఐడీ పార్టీ విభాగంలో కానిస్టేబుల్ పూర్ణచంద్ర కూడా ఉన్నట్లు సీఐ సత్యబాబు వెల్లడించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారన్నారు. ఈ తొమ్మిది మందిపై కేసు నమోదుచేసి, పరారైన వారికోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. తమిళనాడుకు చెందిన సైమన్‌ను జూద నిర్వాహకుడిగా గుర్తించామని తెలిపారు. జూదం, అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు ఎక్కడైనా జరుగుతుంటే తమకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. వీరి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ట్రైనీ డీఎస్పీ పవన్‌కుమార్, ఎస్‌ఐ వెంకటకృష్ణ, ఏఎస్‌ఐ మునికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



జూదరులను అరెస్టు చూపిస్తున్న సీఐ సత్యబాబు

రేపటిలోగా లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వచ్చు

- విశ్రాంత ఉద్యోగులకు చివరి అవకాశం

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 29: ఆన్‌లైన్ ద్వారా గతనెలాఖరులోగా లైఫ్ సర్టిఫికెట్లు వివిధ కారణాలతో అందించలేకపోయిన విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వం చివరి అవకాశం కల్పించింది. ఆదివారంలోగా ఆఫ్‌లైన్ ద్వారా లేదా సబ్ ట్రెజరీ కార్యాలయాలకు నేరుగా వచ్చి లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వచ్చు. జిల్లావ్యాప్తంగా ఉన్న 12,505 మంది పెన్షనర్లలో దాదాపు 12వేల మంది జీవన్‌ప్రమాణ్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో లైఫ్ సర్టిఫికెట్లు అందించారు. ఫిబ్రవరి 29వ తేదీ తర్వాత జీవన్ ప్రమాణ్ యాప్‌లో లైఫ్‌సర్టిఫికెట్ల స్వీకరణ ఆగిపోయింది. మిగిలిన వారికి చివరి అవకాశం ఇవ్వడంతో సుమారు 200 మంది సద్వినియోగం చేసుకున్నారు. మిగిలిన వారిలో.. చాలామంది ఇండ్లలో కదలలేని స్థితిలో ఉండగా, మరికొందరు విదేశాల్లో ఉన్నారు. వీరంతా ఆదివారంలోగా సర్టిఫికెట్లు ఇవ్వకపోతే పెన్షన్ కోల్పోయే ప్రమాదం ఉంది.



ఎఫ్ఎస్ టీం,పోలీసులు పట్టుకొన్న నగదు

పలమనేరులో రూ.16 లక్షలు పట్టివేత

పలమనేరు, మార్చి 29: పలమనేరులో శుక్రవారం రాత్రి లక్ష్మి ఇంట్లో ఉన్న రూ.16 లక్షల నగదును అధికారులు పట్టుకొన్నారు. ప్రకృతి అపార్టుమెంటు ఎదురుగా ఉన్న లక్ష్మి ఇంటిలో నగదు ఉన్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. ఈ విషయాన్ని డీఎస్పీ మహేశ్వర రెడ్డి, సీఐ చంద్రశేఖర్ ఫ్లయింగ్ స్క్వాడ్‌కు సమాచారం అందించారు. శుక్రవారం రాత్రి సుమారు 11 గంటల ప్రాంతంలో స్క్వాడ్ అధికారి రుషివర్మ, ఎస్‌ఐ మహాదేవి, ఐడీ పార్టీ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, సిబ్బంది లక్ష్మి ఇంటికెళ్లారు. డీఎస్పీ ఇచ్చిన సెర్చ్ వారెంటుతో తనిఖీ చేశారు. ఇంట్లోని ఒక పెట్టెలో దాచి ఉంచిన రూ.500 నోట్ల కట్టలు గుర్తించారు. మొత్తం రూ.16 లక్షలను స్వాధీనం చేసుకొన్నారు. నగదు పట్టుకొన్న విషయాన్ని ఐటీ అధికారులకు తెలియజేసి కేసు నమోదుచేసి దర్యాప్తు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఎన్నికల కోడ్ ఎఫెక్ట్..!

- ఎస్వీయూలో అకడమిక్ సెనేట్ సమావేశం రద్దు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 29 : ఎస్వీ యూనివర్సిటీలో నిర్వహించాల్సిన అకడమిక్ సెనేట్ సమావేశం ఎన్నికల కోడ్ కారణంగా రద్దు అయ్యింది. ఏటా మార్చి నెలాఖరులోపు అకడమిక్ సెనేట్ సమావేశం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. యూనివర్సిటీ పరిధిలోని పలు కాలేజీలు, విభాగాల పరిధిలో నిర్వహించే వివిధ కోర్సులు, కొత్త కోర్సుల ఏర్పాటు, సిలబస్ మార్పు, పరీక్షల నిర్వహణ, ఇతర అకడమిక్ వ్యవహారాలపై చర్చించేవారు. ఈనెల 30వ తేదీ సమావేశం నిర్వహించనున్నట్టు అకడమిక్ సెనేట్ సభ్యులు, సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ఈ సమావేశం రద్దు చేయాలని తాజాగా నిర్ణయించినట్టు తెలుస్తోంది. కోడ్ ముగిశాక నిర్వహించే అవకాశముంది.

శ్రీవారి భక్తులు భయాందోళన చెందొద్దు

తిరుమల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కాలినడన తిరుమలకు వచ్చే భక్తులు భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని ప్రభుత్వ ఫారెస్ట్ డీఎఫ్‌వో సతీష్‌కుమార్ అన్నారు. కట్టుదిట్టమైన భద్రత కల్పించామని తెలిపారు. శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. అలిపిరి కాలినడక మార్గంలో 200 ట్రాప్ కెమెరాల ద్వారా చిరుత, ఎలుగుబంట్ల సంచారాన్ని పరిశీలిస్తూనే ఉన్నామన్నారు. ఫిబ్రవరిలో చిరుత పులుల సంచారం కనిపించలేదన్నారు. ఈనెల 4 నుంచి శుక్రవారం రాత్రి వరకు ఐదుసార్లు చిరుత పులి, ఎలుగబంటి సంచారాన్ని గుర్తించామన్నారు. అందుకే విధుల్లోని సిబ్బంది బృందాలుగా ఏర్పడి సాయంత్రం 6 నుంచి అర్ధరాత్రి వరకు భక్తులను గుంపులు గుంపులుగా పంపుతున్నారన్నారు. దీనిపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన జాయింట్ కమిటీ, వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా వారు పరిశీలించారని, వారి సూచన మేరకు మరిన్ని చర్యలు తీసుకుంటామని వివరించారు. ఇటీవల ఏనుగుల సంచారం పెరిగిందని, వాటితోపాటు వన్యప్రాణుల కదలికలు తెలుసుకునేలా డ్రోన్ కెమెరాను తీసుకువచ్చామని అన్నారు.

వైసీపీ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం

కల్లూరు, మార్చి 29: వైసీపీ ప్రభుత్వ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు రామనాథంనాయుడు, రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ విభాగం ప్రధాన కార్యదర్శి ముల్లంగి వెంకటరమణ తెలిపారు. పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ కొక్కువారిపల్లెలో శుక్రవారం టీడీపీ జయహో సభ, టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ పాలనలోనే బీసీలు అభివృద్ధి చెందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోవిందయ్య, మల్లెల సురేష్, మహేష్, రమేష్, దేవ, యర్రయ్య, సరస్వతి, గూకంటి నాగరాజు, రమణ, పార్థసారథి, బాబయ్య, నూర్‌భాషా, గౌనూర్ భాషా, ఈఎం రత్నం, సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎన్టీఆర్

రొంపిచెర్ల, మార్చి 29: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి నందమూరి తారకరామారావు అని రాజంపేట పార్లమెంట్ టీడీపీ రైతు సెల్ అధ్యక్షుడు చింతపర్తి ఓబులేశ్వరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఉయ్యాల రమణ అన్నారు. శుక్రవారం రొంపిచెర్లలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూజమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అమరనాధరెడ్డి, మదనమోహన్‌రెడ్డి, రామమూర్తి, సురేంద్ర, రఘు, ఇమ్రాన్, హయత్‌భాషా, తుల సీరాం,ద్వారక, మాధవరెడ్డి, సహదేవ, గౌస్‌పీర్‌ఖాన్, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఎన్ని కుట్రలు పన్నినా టీడీపీ విజయాన్ని ఆపలేరు

రొంపిచెర్ల, మార్చి 29: వైసీపీ నాయకులు ఎన్ని కుట్రలు పన్నినా రానున్న ఎన్నికల్లో టీడీపీ ఘన విజయాన్ని అడ్డుకోలేరని రొంపిచెర్ల మండల బీసీ నాయకులు పురం మల్లయ్య, కరీముల్లా పేర్కొన్నారు. రొంపిచెర్లలో శుక్రవారం బీసీ వర్గం సమావేశం జరిగింది. తెలుగుదేశం పార్టీ హయాంలోనే బీసీలకు గుర్తింపు వచ్చిందని రాజంపేట పార్లమెంట్ బీసీ సెల్ నాయకుడు సుందరం అన్నారు. ముస్లింలకు తగిన ప్రాధాన్యత టీడీపీలోనే వచ్చిందని రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి షేక్ కరీముల్లా అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు ఉయ్యాలరమణ, మహమ్మదాలి, అబూబకర్, చంద్రగిరి సురేంద్ర, వెంకట్రమణ, నందిమదన, భాస్కర, ఎస్.ఈశ్వరయ్య, హరికృష్ణ పాల్గొన్నారు.

శివాలయంలో డ్రామాలు వద్దు

ఎమ్మెల్యేకు టీడీపీ నాయకుల సూచన

పలమనేరు, మార్చి29 : పలమనేరు కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో సత్య ప్రమాణాల పేరుతో ఇక డ్రామాలు చాలని టీడీపీ నాయకులు ఎమ్మెల్యే వెంకటేగౌడకు సూచించారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ 15 శాతం కమీషన్లు తీసుకొన్నారని, శివాలయం భూములు కబ్జా చేశారని, ఇసుక అక్రమంగా బెంగళూరుకు రవాణా చేశారని ప్రజాగళంలో మాజీ మంత్రి అమర్‌నాథ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపించిన దాన్ని సవాల్ చేస్తూ శుక్రవారం వెంకటేగౌడ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రమాణం చేశారు. దీనిపై తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై సత్యప్రమాణానికి సిద్ధమా అని ఎమ్మెల్యేని ప్రశ్నించారు. ఇకనైనా ఈ సత్యప్రమాణాల డ్రామాను మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకలు ఆర్బీసీకుట్టి, గిరిబాబు, మాభాషా, మదన్‌మోహన్, శ్రీనివాసులు, సుబ్బు, సుదాకర్, నదీమ్, రాజేష్, సాధిక్, మురళి, బాలాజి పాల్గొన్నారు.

యుగంధర్‌బాబు దంపతులకు సన్మానం



పలమనేరు, మార్చి29 : జనవిజ్ఞాన వేదిక నాయకులు, సాహితీవేత్త, ఎల్ఐసీ ఉద్యోగి యుగంధర్ బాబు దంపతులకు శుక్రవారం పలమనేరులో రచయితల సంఘం శాలువకప్పి, ఘనంగా సన్మానించారు. ఆయన చేసిన సామాజిక, సాహితీ సేవలకుగాను సాహిత్య కళామణి అనే బిరుదును తెలుగు సాహిత్యసాంస్కృతిక సమితి, పలమనేరు రచయితల సంఘం సంయుక్తంగా అందించారు. ఈ కార్యక్రమంలో రచయితలు పలమనేరు బాలాజి, తులసినాథం నాయుడు, ప్రభుత్వ డిగ్రీకళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ రాజేంద్రరెడ్డి, జనవిజ్ఞానవేదిక రాష్ట్రనాయకులు అరుణ్‌శివప్రసాద్, రెడ్డెప్ప, హరేంద్రనాథ్‌శర్మ, రంగనాథం, పలమనేరు రచయితల సంఘం గౌరవాధ్యక్షులు ఆర్.మాధవ్, ఉపాధ్యాయసంఘ నాయకులు జీవి.రమణ, సీపీ ప్రకాష్, పలమనేరు ప్రకృతి సంస్థ కన్వీనర్ మల్లిచెట్లదేవేంద్ర, పట్టణ ప్రముఖులు శ్రీపురం సీతారామయ్య, లయన్ నరేంద్ర, ఎంఈఓ వేణుగోపాల్, హెచ్ఎం ఉమామహేశ్వరరెడ్డి, తహసీల్దార్ అమరనాథ్, సాహిత్యసాంస్కృతిక సమితి కార్యదర్శి పుష్ప,జిల్లా సైన్స్ ఉపాధ్యాయులు రమణ, రచయితలు జొన్నవిత్తుల శ్రీరామచంద్ర మూర్తి, జి.శ్రీనివాస, చంద్రశేఖరయ్య, గండికోట వారిజ, బాలకృష్ణమూర్తి, కందుకూరి సుదర్శనాచారి, తదితరులు పాల్గొన్నారు.


రాజంపేట ఎంపీగా కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలి



బైనిగానిపల్లెలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

పుంగనూరు, మార్చి29: రాజంపేట పార్లమెంటు బీజేపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపిస్తే జిల్లా అభివృద్ధి జరుగుతుందని రాష్ట్ర బీజేపీ మైనార్టీ మోర్చా నాయకుడు అయూబ్‌ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం పుంగనూరు మండలం రాగానిపల్లె పంచాయతీ బైనిగానిపల్లెలో ఇంటింటా తిరిగి బీజేపీ పేదలకు అందించిన సంక్షేమ పథకాలు ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ అనుభవం కలిగిన వ్యక్తి ఎంపీ అభ్యర్థిగా మనకు రావడం అభినందనీయమన్నారు.

చంద్రబాబుతోనే నవ్యాంధ్ర అభివృద్ధి : చల్లా



కాటిపేరిలో పర్యటిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

చౌడేపల్లె, మార్చి29: నవ్యాంధ్ర అభివృద్ధి టీడీపీ అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని కాటిపేరి, ఒడ్డిపల్లె, అగిస్థిగానిపల్లె, కెంగనపల్లె గ్రామాలలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ బీసీలు, మైనార్టీల అభివృద్ధి టీడీపీతోనే అని అన్నారు. దుర్గసముద్రం మాజీ సర్పంచ్ వెంకటరమణకు ఆయన టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గువ్వల రమేష్‌రెడ్డి, జంపాల శ్రీనివాసులునాయుడు, బీజేపీ నాయకులు గందోడి ప్రవీణ్, జనసేన నాయకులు పురుషోత్తం, గిరిరాజు, కల్యాణ్, బోయకొండ సుబ్బు, హరిప్రసాద్, ప్రభాకర్, మహ్మద్‌గని, అహ్మద్‌ఖాన్, బాబునాయుడు, విజయభాస్కర్‌రెడ్డి, పార్థసారధి, కాటిపేరి భాస్కర్‌నాయుడు, శ్రీనివాసులురెడ్డి, రమణ, వెంగళపల్లె రమణ పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి

గుడుపల్లె, మార్చి 29: టీడీపీతోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని పార్టీ మండలాధ్యక్షుడు బాబునాయుడు పేర్కొన్నారు. శుక్రవారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూజలు చేసి, ఆ తరువాత టీడీపీ జెండా ఎగరవేసారు. అనంతరం కేక్ కట్‌చేసి అందరికి పంచి పెట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ. ప్రతి కార్యకర్త వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలన్నారు. 2024లో చంద్రబాబు సీఎం కావడం తథ్యమని, కుప్పం ప్రజలకు మంచి రోజులు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, హేమాంబర్‌గౌడు, బేటప్పనాయుడు, శ్రీనివాసులు, సుబ్బు, గోపాల్, గోవిందస్వామి, నారాయణ, ఎస్ఆర్ చంద్ర, చంద్రప్ప, రామప్ప, బానుమూర్తి, లక్ష్మీపతి, పాపన్న, ఉదయ్‌కుమార్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కందూరులో బలిపోతుకు పూజలు

సోమల : కందూరులో గంగ జాతరను పురస్కరించుకుని శుక్రవారం బలిపోతుకు పూజలు జరిపారు. పగడాలవారిపల్లె, బాలప్పగారిపల్లెలో బలిపోతును ఊరేగించారు. మార్చి 31, ఏప్రిల్ 1వ తేదీల్లో జాతర నిర్వహణకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చురుగ్గా చేపట్టారు.

ఏసుక్రీస్తు చూపిన మార్గంలో నడవాలి







చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ రాఖేశ్‌నిమ్రోద్, పలమనేరులో శిలువను ప్రదర్శిస్తున్న క్రిస్టియన్లు , రామకుప్పంలో ఏసుక్రీస్తు వేషధారిణి ఊరేగింపు

పుంగనూరు, మార్చి 29: ఏసుక్రీస్తు చూపిన కరుణ, దయ మార్గాల్లో క్రైస్తవులు నడిచి సేవా గుణాన్ని పెంపొందించుకోవాలని పుంగనూరు సీఎస్ఐ చర్చి పాస్టర్ రాఖేశ్‌నిమ్రోద్ సూచించారు. శుక్రవారం స్థానిక చర్చిలో క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే జరుపుకొన్నారు. పాస్టర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సివుందని పేర్కొన్నారు. ఆదివారం ఈస్టర్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు.

పలమనేరు : పలమనేరులో శుక్రవారం క్రిస్టియన్లు గుడ్‌ఫ్రైడే పండుగను ఘనంగా జరుపుకొన్నారు. చర్చిల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సెయింట్ లూయిస్ చర్చి సమీపంలో ఏసుక్రీస్తు శిలువ వేయబడిన వైనాన్ని వారు ప్రదర్శన చేశారు.

రామకుప్పం : క్రైస్తవులు స్థానిక చర్చిల్లో సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం శిలువను ఎత్తుకున్న ఏసుక్రీస్తు వేషధారిని పట్టణ వీధుల్లో ఊరేగించారు. మండలంలోని బల్ల, సింగసముద్రం. 89పెద్దూరు, నారాయణపురంతాండా, వీర్నమల గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే జరుపుకొన్నారు.

కల్లూరు : కల్లూరు బీసీ కాలనీలోని చర్చిలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. పాస్టర్ ధన్‌రాజ్ ఆధ్వర్యంలో జీసస్ భక్తి పాటలు, జీసస్ సందేశాలను భక్తులకు వినిపించారు.

సోమల : మండలంలోని క్రైస్తవ మందిరాల్లో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రార్థనలు జరిపారు. సోమల, నంజంపేట, కందూరు, పెద్దఉప్పరపల్లె లోని చర్చిల్లో భక్తి శ్రద్ధలతో క్రీస్తు శిలువ మోసి చనిపోయిన రోజును గుర్తుకు తెచ్చుకున్నారు.

టీడీపీ ఊపిరి బడుగు బలహీన వర్గాలే..





కుప్పంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ శ్రేణులు, పలమనేరు టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

కుప్పం, మార్చి 29: తెలుగుదేశం పార్టీ ఊపిరి బడుగు బలహీన వర్గాలేనని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్, విస్తరణ కమిటీ ఛైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, భారీ కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం అందిచడమే లక్ష్యంగా ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారన్నారు. అనంతర కాలంలో చంద్రబాబు ఎన్టీఆర్ ఆశయాలను మరింత ముందుకు తీసుకు వెళ్లారని పేర్కొన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని వర్గాలు తీవ్ర అణచివేతకు, దాడులు, దౌర్జన్యాలకు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని, అప్పుడు అన్ని వర్గాల ప్రజలకు సరైన న్యాయం జరగడమేకాకుండా రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలమనేరు : పలమనేరు టీడీపీ కార్యాలయంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు ఆర్బీసీకుట్టి, నాగరాజు, గిరిబాబు, ఖాజాపీర్, బ్రహ్మయ్య, వెంకటరమణారెడ్డి, సుబ్రమణ్యంగౌడు, కృష్ణమూర్తి, బీఆర్సీకుమార్, మాభాషా, సోమశేఖర్‌గౌడు, నాగరాజ రెడ్డి, జగదీష్‌నాయుడు, అమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె : బైరెడ్డిపల్లెలో శుక్రవారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీశ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. రాయల్‌మహల్‌లో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్‌చేసి పలువురికి పంచిపెట్టారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసమే టీడీపీ ఆవిర్భావం



రామకుప్పంలో ఎన్టీయార్‌కు నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు

రామకుప్పం, మార్చి 29: అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసమే స్వర్గీయ ఎన్టీయార్ టీడీపీని ఏర్పాటు చేశారని ఆ పార్టీ రామకుప్పం మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణచారి తెలిపారు. శుక్రవారం రామకుప్పం టీడీపీ కార్యాలయంలో పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఎన్టీయార్ చిత్రపటానికి పూజలు చేసి, ఘన నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ఎన్టీయార్ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, అదే బాటలో చంద్రబాబు పయనిస్తూ వాటిని మరింత విస్తృతంగా అమలు చేశాన్నారన్నారు. అనంతరం జరిగిన ఎన్డీఏ పక్షాల ముఖ్యనేతల సమావేశంలో పలువురు మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ళ పాలన రాష్ట్రానికి శాపంగా మారిందన్నారు. వైసీపీ సాగించిన నిరంకుశ పాలనలో అన్ని వర్గాల ప్రజలు దగా పడ్డారన్నారు. కుప్పంలో చంద్రబాబును లక్ష మెజారిటీతో గెలిపించేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు కలిసికట్టుగా కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు.

యువత భవిత టీడీపీతోనే..

రాష్ట్రంలో యువత భవిష్యత్తు టీడీపీతోనే ముడిపడి ఉందని తెలుగు యువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం తెలిపారు. శుక్రవారం మండల పరిధి 89పెద్దూరు, కెంచనబల్ల, సింగసముద్రం పంచాయతీల్లో జరిగిన తెలుగు యువత సమావేశాల్లో వారు మాట్లాడతూ వైసీపీ గత ఎన్నికలకు ముందు యవతకు ఎన్నో హామీలిచ్చి, గద్దెనెక్కిన తర్వాత వాటిని తుంగలో తొక్కిందన్నారు. ఏటా జాబ్ కేలండర్ ఇస్తామని యువతకు మోసం చేసిందన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నపుడు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా స్వయం ఉపాధి కోసం వివిధ కార్పోరేషన్ల ద్వారా విరివిగా సబ్సిడీ రుణాలిచ్చిందన్నారు. రాష్ట్రంలో యువత భవిష్యత్తు బాగుండాలంటే తిరిగి టీడీపీ ప్రభుత్వం వస్తేనే అది సాధ్యమవుతుందన్నారు.

కుటుంబ కలహాలతో హోటల్ యజమాని ఆత్మహత్య



బాలగంగాధర్‌తిలక్ (ఫైల్‌ఫొటో)

పుంగనూరు రూరల్, మార్చి 29: కుటుంబ కలహాలతో ఓ హోటల్ యజమాని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం పుంగనూరులో చోటుచేసుకుంది. కుటుంబీకుల కథనం మేరకు ... పుంగనూరు కొత్తపేటకు చెందిన బాలగంగాధర్‌తిలక్‌నాయుడు(56) కొత్తపేట క్రాస్‌లో హోటల్ నిర్వహిస్తున్నాడు. ఇతడికి ఇద్దరు కుమార్తెలు పెద్దకుమార్తె లిఖిత, చిన్న కుమార్తె వినిత ఇద్దరికి వివాహం చేశారు. చిన్న కుమార్తె వినితకు ఏడాది క్రితం సమీప బంధువైన పెద్దపంజాణికి చెందిన జ్యోతిష్‌నాయుడుకు ఇచ్చి వివాహం చేశారు. అయితే జ్యోతిష్‌నాయుడు వైజాక్‌లో బిల్డర్‌గా వ్యవహరిస్తున్నట్లు అత్త, మామ, భార్యను నమ్మించి మోసం చేసినట్లు ఆరోపించారు. ఇటీవల డబ్బు అవసరమని రూ. 30లక్షలు తీసుకున్నప్పటికీ తిరిగి భార్యను ప్రతిరోజు డబ్బు కోసం వేధించడంతో పుట్టినిల్లు చేరింది. కుటుంబంలో గొడవలు జరగడంతో మనస్థాపానికి గురైన బాలగంగాధర్ రాత్రి స్థానిక మార్కెట్‌యార్డులోని ఓ చెట్టుకు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం కుటుంబసభ్యులు బాలగంగాధర్ ఇంటిలో లేకపోవడంతో చుట్టుపక్కల వెతకడంతో స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబసభ్యులు చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని కిందకు దింపారు. ఎస్ఐ సుబ్బారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతిపై ఆరా తీసి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రామచంద్రయాదవ్‌ను ఆదరించండి

పుంగనూరు, మార్చి 29: ఎన్నికల్లో బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్‌ను ప్రజలు ఆదరించి ఒక్క అవకాశం కల్పించాలని ఆ పార్టీ నాయకులు పుంగనూరులో ఎన్నికల ప్రచారం చేశారు. స్థానిక హనుమంతురాయదిన్నె, రాంనగర్, గాజులవారివీధి, ప్రకాశంకాలనీ, బీడీ కాలనీ, అలగన్నవారివీధి, జోగిండ్లు, అంగడివీధి, కోనేటిపాళ్యం తదితర ప్రాంతాల్లో బీసీవైపీ నాయకులు చెరుకు రైతు గుర్తును బలపరచాలని కోరుతూ ఎన్నికల మ్యానిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో బీసీవైపీ నాయకులు మార్కెట్‌కమిటీ మాజీ ఛైర్మన్ హరినాథరెడ్డి, సాంబమూర్తి, వేణుగోపాల్‌రెడ్డి, కిరణ్, మున్నా, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రలోభాలకు ఆశపడకండి : గౌనివారి

శాంతిపురం, మార్చి 29: ఎన్నికల సమయంలో వైసీపీ అందించే తాయిలాలకు ఆశపడి బిడ్డల జీవితాలు నాశనం చేసుకోవద్దని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ కార్యాలయంలో ఎన్‌టీఆర్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్యకర్త 40 రోజులు శ్రమించి చంద్రబాబు కు లక్ష మెజార్టీ తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నేతలు ఉదయ్ కుమార్, విజయరామిరెడ్డి, ఉయ్యాల జయరామి రెడ్డి, ఆర్ఎస్ మణి, చంద్రశేఖర్, ఎంసీ నాగరాజు, అంజనేయ రెడ్డి, పివి నాగరాజు, అనసూయ, శ్యామల, చంద్రకళ, సుగుణమ్మ, రూప తదితరుల నాయకులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘనలపై నిఘా పెంచాలి

రామకుప్పం, మార్చి 29: ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై వీఆర్వోలు అప్రమత్తంతో వ్యవహరించాలని తహసీల్దారు శ్రీధర్ ఆదేశించారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కోడ్ ఉల్లంఘనల సమాచారం తెలిసిన వెంటనే నిజానిజాలు నిర్ధారించుకుని, ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. తరచూ పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తూ అక్కడ మౌలిక వసతులు మెరుగు కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. డిప్యూటీ తహశీల్దారు దిలిప్‌కుమార్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వరి పొలాలకు అడవి పందుల బెడద



వరి పొలం చుట్టూ రక్షణగా చీరలు

సోమల, మార్చి 29: వరి పొలాల్లో అడవి పందులు స్వైరవిహారం చేస్తూ రైతుల కంట కన్నీరు తెప్పిస్తున్నాయి. గురువారం రాత్రి సోమల తిరుపతి గంగమ్మ ఆలయం సమీప వరి పొలంలో అడవి పందులు ప్రవేశించి ఎన్ను వస్తున్న పంటలో తిరగాడి నష్టపరిచాయి. పొలం చుట్టూ పాత చీరలు, సౌండ్ సిస్టమ్స్ ఏర్పాటు చేసినా ఫలితం లేకపోతోంది. సోమల, అడుసుపల్లె, ఇరికిపెంట, సూరయ్యగారిపల్లె, నెల్లిమంద, నడింపల్లె, చిన్నఉప్పరపల్లె తదితర ప్రాంతాల్లో అడవి పందుల బెడద తీవ్రంగా ఉంది. వీటికి తోడు వడ్డిపల్లె, చెన్నయ్యగారిపల్లె, భారతం మిట్ట, కరకమంద ప్రాంత పొలాల్లోకి దుప్పులు వస్తున్నాయని రైతులు తెలిపారు.

సత్యసాయి సేవాసమితి ఆధ్యాత్మిక ప్రచారం

కుప్పం, మార్చి 29: శ్రీసత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మధుసూదన్ ఆధ్వర్యంలో సమితి సభ్యులు శుక్రవారం కుప్పం నియోజకవర్గంలో పర్యటించి ఆధ్యాత్మిక ప్రచారం నిర్వహించారు. ద్రావిడ విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని వినాయకస్వామి ఆలయం వద్ద తాము నాటిన వటవృక్షాన్ని పరిశీలించారు. జేకే.పల్లె భజనమండలి, కుప్పం శాస్త్రీవీధిలోని భజనమండలి, సత్యసాయి భజనమండలి సభ్యులకు లిఖితనామ జప పుస్తకాలు అందించి, వాటివల్ల చేకూరే ఆధ్యాత్మికత గురించి వివరించారు. ప్రశాంతి నిలయంలో ఏప్రిల్ 9 నుంచి 20వ తేదీ వరకు జరిగే సేవకు రెండవ బ్యాచ్ సభ్యుల జాబితా పంపాలని సూచించారు. రాళ్లబూదుగూరులో భజన మండలి, సమితి ఏర్పాటు కోసం భక్తులను అంగీకరింప చేశారు.

టీ గ్లాసుల వివాదంతో కత్తితో దాడి

పలమనేరు, మార్చి29 : పలమనేరు ఆర్టీసీ బస్టాండులోని టీ దుకాణం నుంచి తాగిన టీ గ్లాసులు తన క్లినిక్ ఎదుట వేస్తున్నారని శుక్రవారం సాయంత్రం శివశంకర్ అనే ఆర్ఎంపీ టీ దుకాణదారుడిని నిలదీశాడు. దీంతో మాటామాట పెరిగి శివశంకర్ తన వద్ద ఉంచుకున్న కత్తితో టీ దుకాణదారుడు షాజహాన్‌ను పొడవడంతో అతడికి ఛాతిపై గాయమైంది. దీనిపై శివశంకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పసుపు, కుంకుమ అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, మార్చి29: పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం పసుపు, కుంకుమ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు శ్రీనివాసులు, మురళీలు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారిని దర్శించుకుని చీరలు, రవికలు మొక్కులుగా చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

సోమలలో రూ. 1.06 లక్షల నగదు సీజ్

సోమల, మార్చి 29: సోమల-తిరుపతి మార్గంలోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద శుక్రవారం బిల్లులు లేకుండా తీసుకు పోతున్న రూ. 1.06 లక్షలు నగదును తనిఖీ అధికారులు సీజ్ చేసినట్లు ఎస్ఐ వెంకట నరసింహులు తెలిపారు. పీలేరు పట్టణం హరినాథ్‌పురానికి చెందిన గౌస్‌పీర్ బొలేరో వాహనంలో ఎలాంటి బిల్లులు లేకుండా రూ. 1.06 లక్షలు నగదును తీసుకొస్తుండగా పోలీసులు నగదును గుర్తించి సీజ్ చేశారు. హెచ్‌సీలు దేవరాజులు, నగేశ్, బాలచంద్ర పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

పలమనేరు, మార్చి29 : డిప్లొమా కోర్సుల ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినులకు పలమనేరు మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ మొహమ్మద్ తెలిపారు. పాలిసెట్-2024 పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినులకు ఏప్రిల్ 1నుంచి 24వ తేది వరకు శిక్షణ ఇచ్చి ఉచితంగా స్టడీ మెటీరియల్స్ అందజేస్తున్నట్లు తెలిపారు. పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 5వ తేదీ వరకు గడువు ఉందన్నారు.

పరిసరాల శుభ్రత ముఖ్యం

సోమల, మార్చి 29: ఇంటి పరిసరాల పరిశుభ్రత ముఖ్యమని పెద్దఉప్పరపల్లె వైద్యాధికారి డాక్టర్ బాలాజీ అన్నారు. శుక్రవారం పేటూరు, బోనమంద గ్రామాల్లో వైద్యసిబ్బందితో కలసి పలువురికి ఆరోగ్య పరీక్షలు జరిపారు. వేసవిలో వడ దెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అలాగే సోమలలో సబ్ యూనిట్ అధికారి గంగయ్య, ఎంపీహెచ్‌వో అమరనాథ్ ఆధ్వర్యంలో డ్రై డే ఆవశ్యకతను వివరిస్తూ గ్రామంలో పర్యటించి పలు సూచనలు చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

గంగవరం, మార్చి 29 : కర్ణాటక నుంచి గంగవరం మీదుగా మద్యం తరలిస్తున్న ఒకరిని అరెస్ట్ చేసి మద్యం సీజ్ చేసినట్లు సీఐ చిన్నగోవిందు తెలిపారు. శుక్రవారం నిందితులను అరెస్ట్ చూపి వివరాలను వెల్లడించారు. పసపత్తూరు క్రాస్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా కురపల్లెకు చెందిన ప్రకాష్‌బాబు ద్విచక్రవాహనంపై వెనుక ఓ ప్లాస్టిక్ సంచెను పెట్టుకొని వస్తుండగా, అనుమానం వచ్చి పరిశీలించారు. ఈ తనిఖీల్లో కర్ణాటకకు చెందిన మూడు కేసుల మద్యం బయటపడింది. దీంతో మద్యం తరలిస్తున్న ప్రకాష్‌బాబును అరెస్ట్ చేసి స్వాధీనం చేసుకున్న మద్యం, ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసి కోర్టుకు హాజరుపరచామని సీఐ తెలిపారు.

వ్యాసరాజస్వామి ఆరాధనోత్సవం



బైరెడ్డిపల్లె, మార్చి 29 : తీర్థంగ్రామంలో వున్న రాఘవేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం వ్యాసరాజస్వామి ఆరాధనోత్సవాన్ని నిర్వహించారు. అర్చకులు రమేష్ వ్యాసరాజస్వామి చిత్రపటానికి పూజలు చేసి ప్రాకారోత్సవం జరిపారు. గురురాజాసేవాసమితి నిర్వాహకులు మురళీధర్‌రావు, శ్రీనివాసమూర్తి, గురురాజు, మోహన్, ఆనందరావు, వేదవ్యాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



చౌడేపల్లె, మార్చి29: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. రాహుకాలంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తులకు ఆలయ ఛైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు



చౌడేపల్లె, మార్చి29 : పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ నిర్వహకులు వినోద్ కుమార్‌రెడ్డి, శ్రావణిలు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

గాయపడ్డ వ్యక్తి మృతి



చౌడేపల్లె, మార్చి29: ఈనెల 22న రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. చారాల సమీపంలో ఈనెల 22న ఓ వాహనం గుర్తుతెలియని వ్యక్తిని ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ వ్యక్తిని 108 వాహనంలో తిరుపతి రూయా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే 9440900698 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

బగళనత్తంలో శంఖారావం

రామకుప్పం, మార్చి 29: బగళనత్తం గ్రామంలో శుక్రవారం రాత్రి టీడీపీ నాయకులు శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. వారు సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కుప్పం నియోజకవర్గంలో టీడీపీని ఆదరించి, చంద్రబాబును భారీ మెజారిటీతో గెలపించాలని వారు కోరారు. అదేవిధంగా సగినేకుప్పంలో పార్టీ శ్రేణులు శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో నేతలు ఆనందరెడ్డి, శ్రీనాథరెడ్డి, మునిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, సోమశేఖర్‌నాయుడు, భాస్కర్, సుబ్రహ్మణ్యం, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.


కొత్త రూపు ఇలా ఉంటుంది

తిరుపతి రైల్వేస్టేషన్‌కు వరల్డ్‌క్లాస్ హంగామా

తిరుపతి రైల్వేస్టేషను రూపురేఖలు మారుతున్నాయి. కార్పొరేట్‌కు దీటుగా, కళ్లు చెదిరేలా కొత్త స్టేషన్ పనులను పట్టాలెక్కించేందుకు అధికార వర్గాలు శ్రమిస్తున్నాయి. ప్లాట్‌ఫారాలు, లిఫ్టులు, ఎస్కలేటర్లు కొత్త రూపుదిద్దుకుంటున్నాయి. అనునిత్యం అసంఖ్యాకంగా తిరుమలకు వచ్చే భక్తులకు అన్ని వసతులతో కూడిన స్టేషన్ నిర్మించేందుకు కేంద్రం గతేడాది జూన్ 13న రూ.300 కోట్లతో శ్రీకారం చుట్టింది. ఇప్పటికే 30 శాతం పనులు పూర్తయ్యాయి. అన్ని ఆధునిక హంగులూ సమకూర్చి వచ్చే ఏడాది లోపు నిర్మాణ పనులు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.

- తిరుపతి సెంట్రల్

వేగంగా జరుగుతున్న పనులు

బహుళ అంతస్తుల నిర్మాణం, కార్పొరేట్ సౌకర్యాలతో మారనున్న రూపురేఖలు


తిరుపతి రైల్వే స్టేషన్ పాతభవన ముఖ ద్వారం


ఉత్తర, దక్షిణ ప్లాట్‌ఫారాలను కలిపే ర్యాంపుల నిర్మాణాలు


రైల్వేస్టేషన్ దక్షిణం వైపు మూడంతస్తుల భవన నిర్మాణం



తిరుపతికి పెరగనున్న రైళ్లు

తిరుపతి పుణ్యక్షేత్రానికి పెరుగుతున్న ఆదరణను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం ఉత్తర భారతదేశంలో ఉన్న పలు పుణ్యక్షేత్రాలను కలుపుతూ మరికొన్ని నూతన ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడపనుందని స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ తెలిపారు.



దక్షిణం వైపు.. : ● ఈ భవనం అండర్ గ్రౌండ్‌లో 200 కార్లు, జీపులు, 300 ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసుకొనే వసతులు ఉంటాయి. ● మొదటి అంతస్తులో టికెట్ బుకింగ్ కౌంటర్లు, ప్రయాణికుల రాకపోకలకు వసతులు, ట్రాఫిక్ నిర్వహణ, ఏఎస్ఎం కార్యాలయాలు, ప్రయాణికుల విశ్రాంత హాళ్లు ఉంటాయి. ● రెండో అంతస్తులో ప్రయాణికులకు అవసరమైన ఆహార పదార్థాల దుకాణాలు, విశ్రాంత గదులు ఉంటాయి. ● మూడో అంతస్తులో విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగుల కోసం రెస్ట్ రూములు, ఇతర రైల్వే అధికారుల కార్యాలయాలు ఉంటాయి. ● ఈ భవనంలో ప్రయాణికులు కింది నుంచి పైకి వెళ్లడానికి 8 లిఫ్టులు, 4 ఎస్కలేటర్లు ఉంటాయి.

ఉత్తరం వైపు.. : ● ఈ భవనాన్ని 10,800 చదరపు మీటర్లతో మూడు అంతస్తులుగా నిర్మిస్తారు. ● గ్రౌండ్ ఫ్లోర్‌లో టికెట్ బుకింగ్ కౌంటర్లు, రాకపోకలు నిర్వహించే ప్రయాణికులకు సేవలు, రైల్వే ఆపరేటింగ్ ఉద్యోగుల కార్యాలయాలు, ఎస్ఎంఆర్, ఏఎస్ఎంల కార్యాలయాలు ఉంటాయి. ● మొదటి అంతస్తులో కామన్ వెయిటింగ్ హాల్స్, వీఐపీ లాంజ్‌లు, క్లాక్ రూమ్‌లు ఉంటాయి. ● రెండో అంతస్తులో విశ్రాంతి గదులు, ఫుడ్ కోర్టులు, పలురకాల దుకాణాలు ఉంటాయి. ● మూడో అంతస్తులో ముందస్తు టికెట్ రిజర్వేషన్ కౌంటర్లు, పలు రైల్వే విభాగాల కార్యాలయాలు, రిటైరింగ్ రూమ్‌లు ఉంటాయి. ● ఈ భవనంలో 6 లిఫ్టులు, 4 ఎస్కలేటర్లు ఉంటాయి. అండర్ గ్రౌండ్ ఉండదు.

ఈ రెండు భవనాలకు ప్లాట్‌ఫారాలతో అనుసంధానం చేస్తూ 35 మీటర్ల వెడల్పుతో రెండు వైపుల పాదచారులకు రహదారి వసతులు (ఎయిర్ కాన్ కోర్సులు) కల్పించనున్నారు.

ఇలా అయితే రద్దీ భారం తగ్గుతుంది

రైళ్ల రద్దీతో స్టేషన్ లోపలకు చేరుకోవడానికి కొంత ఆలస్యం అవుతోంది. కిలోమీటరు దూరంలో ఉన్న వెస్ట్ రైల్వే స్టేషన్‌ను ప్యాసింజర్ టెర్మినల్‌గా వినియోగించుకోవచ్చు. రేణిగుంట రైల్వే జంక్షన్ వరకు కొన్ని ఎక్స్‌ప్రెస్‌లను ఆపి మరో టెర్మినల్‌గా వినియోగించుకోవచ్చు. తిరుచానూరు రైల్వేస్టేషన్‌లోనే కొన్ని రైళ్లను నిలపవచ్చు. ఇందువల్ల నగరం కూడా విస్తరిస్తుంది.

50 ఏళ్ల విజన్‌తో నిర్మాణం

130 ఏళ్ల క్రితం మీటర్ గేజ్ రైలు మార్గంలో రెండు మూడు రైళ్లతో తిరుపతి రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు ప్రారంభమయ్యాయి. కాలక్రమేణా ఈ మార్గం బ్రాడ్‌గేజ్‌గా మారింది. నేడు దేశం నలుమూలల నుంచి 130కి పైగా రైళ్లు తిరుపతి మీదుగా రాకపోకలు సాగిస్తూ రోజుకు 80వేల మంది వరకు ప్రయాణిస్తుంటారు. ఇందుకు అనుగుణంగా కొత్త స్టేషన్ రూపుదిద్దుకుంటోంది. స్టేషన్‌కు దక్షిణం వైపు 14,600 చదరపు మీటర్లతో అండర్ గ్రౌండ్ తోపాటు మూడంతస్తులు నిర్మిస్తున్నారు. ఉత్తరం వైపు 10,800 చదరపు మీటర్లతో మూడంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. 50 ఏళ్ల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని నిర్మాణాలు చేపడుతున్నారు.

ప్రచార సామగ్రి మాటున తాయిలాలూ తరలించేశారా?

కలెక్టర్ ఉత్తర్వుల పేరిట
వైసీపీ ప్రచార సామగ్రి తరలింపు
టీడీపీ నేతలకు, మీడియాకు నో ఎంట్రీ
వివరాలు సైతం వెల్లడించని వైనం

రేణిగుంట, మార్చి 29: జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల పేరిట రేణిగుంట గోదాముల నుంచీ వైసీపీ ప్రచార సామగ్రి మొత్తం తరలించేశారు. ఆ ప్రక్రియను పరిశీలించేందుకు వెళ్ళిన టీడీపీ నేతలను, మీడియా ప్రతినిధులను గోదాముల్లోకి అనుమతించలేదు. వీడియోలు, ఫొటోలు కూడా తీయనివ్వలేదు. కనీసం వివరాలైనా వెల్లడించమని కోరినా నోరు మెదపలేదు. రేణిగుంట శివార్లలోని ప్రైవేటు గోదాముల్లో నిల్వ వుంచిన వైసీపీ ప్రచారసామగ్రిని మరో చోటకు తరలిస్తున్నారన్న సమాచారం అందడంతో అప్రమత్తమైన శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి శ్రీకాళహస్తి నుంచీ తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు అక్కింతల కృష్ణ యాదవ్ నేతృత్వంలో పలువురు నాయకులను రేణిగుంట గోదాముల వద్దకు పంపించారు. వారు వెళ్ళేటప్పటికి రేణిగుంట, ఏర్పేడు తహసిల్దార్లు, రెవిన్యూ సిబ్బంది, పోలీసు బందోబస్తు నడుమ గోదాముల నుంచీ లారీల్లో వైసీపీ ప్రచార సామగ్రిని తరలిస్తున్నారు. సీజ్ చేసిన సామగ్రిని ఎందుకు, ఎక్కడికి తరలిస్తున్నారని టీడీపీ నేతలు ప్రశ్నించగా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు సామగ్రిని విడుదల చేస్తున్నామని, ఏదైనా వివరాలు కావాలంటే రిటర్నింగ్ అధికారిని అడగండంటూ రేణిగుంట తహసిల్దారు నాగేశ్వరరావు సమాధానమిచ్చారు. గోదాముల లోపలికి వెళ్ళి వీడియోలు, ఫొటోలు తీసేందుకు యత్నించగా అధికారులు వారిని లోనికి అనుమతించలేదు. ఈ విషయమై టీడీపీ నేతలు ఇచ్చిన సమాచారంతో మీడియా ప్రతినిధులు గోదాముల వద్దకు చేరుకోగా వారిని కూడా అధికారులు గోదాముల లోపలికి రానివ్వలేదు. శుక్రవారం ఉదయం నుంచీ రాత్రి వరకూ లారీల్లో వైసీపీ ప్రచార సామగ్రి గోదాముల నుంచీ బయటి ప్రాంతానికి తరలిపోతూనే వున్నాయి.ఓటర్లను ప్రభావితం చేయగలిగిన తాయిలాలను మాత్రం మూడు గోదాముల నుంచీ వేరుచేసి ఒక గోదాములో వుంచి సీజ్ చేశారు.


పోలీసు పహారా నడుమ గోదాములో ఉన్న వైసీపీ సామగ్రి తరలింపు

అధికారుల తీరుతో బలపడుతున్న అనుమానాలు

గోదాముల నుంచీ వైసీపీ ప్రచార సామగ్రిని విడుదల చేసిన క్రమంలో అధికారుల తీరు పలు అనుమానాలకు అవకాశమిస్తోంది. ఎన్నికల ప్రక్రియ వివిధ రాజకీయ పక్షాలతో కూడుకున్నది. అందుకే నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మొదలుకుని జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దాకా ఎన్నికల సమయంలో తరచూ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు పెడుతుంటారు. నాయకులకు సమగ్ర సమాచారం ఇవ్వడం, వారి అనుమానాలను నివృత్తి చేయడం, ఫిర్యాదులను పరిష్కరించడం, తాము తీసుకున్న చర్యలను వివరించడం చేస్తుంటారు. ఈ పారదర్శకత అన్నది లేకపోతే ఎన్నికల ప్రక్రియకు అర్థమే లేదు. అయితే జిల్లాలో దీనికి విరుద్ధంగా ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. వైసీపీ ప్రచార సామగ్రికి బిల్లులు వుంటే, ఎంత పరిమాణానికి వున్నాయి? అవి సరైనవేనా లేక నకిలీవా? అన్నది ఫిర్యాదు చేసిన టీడీపీ నేతలకు అధికారులు వివరణ ఇవ్వాల్సిన అవసరముంది. అయితే ఆ ప్రయత్నం అధికారులు చేయలేదు. మీడియా ద్వారా ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యతనూ విస్మరించారు. వీటన్నింటికీ మించి గోదాముల్లో ఓటర్లకు పంపిణీ చేసే ఉద్దేశంతో నిల్వ వుంచిన తాయిలాల వాస్తవ పరిమాణం బయటికి తెలిసే అవకాశం లేకుండా పోయింది. రూ. 1.22 కోట్ల విలువైన తాయిలాలను గుర్తించి సీజ్ చేశామని అధికారులు చెబుతున్నప్పటికీ దాన్ని ప్రతిపక్ష పార్టీలు గానీ ప్రజలు గానీ నమ్మడం లేదు. తాయిలాలు భారీగానే వుంటాయని, అధికారులు నామమాత్రంగా నమోదు చేశారన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం వైసీపీ ప్రచార సామగ్రి మాటున తాయిలాలను కూడా బయటికి తరలించేశారన్న ఆరోపణలు కూడా వస్తున్నాయి. మరోవైపున ఇందులో సహకరించిన కొందరు అధికారులకు భారీగా ముడుపులు ముట్టాయన్న ఆరోపణలూ వున్నాయి. ఈ మేరకు ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు కూడా వెళుతున్నాయి. గురువారం రాష్ట్రస్థాయి ప్రతిపక్ష పార్టీల నేతలు రాష్ట్ర ఎన్నికల అధికారికి ఏకంగా జిల్లా కలెక్టర్‌పైనే ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఫిర్యాదులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు ప్రతిపక్షాలతోపాటు ప్రజల నమ్మకాన్ని కూడా కోల్పోతున్నారు. అయినా అధికారుల తీరులో ఎలాంటి మార్పూ కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రచార సామగ్రి, తాయిలాల విషయంలో మండల స్థాయి నుంచీ జిల్లా అధికారుల వరకూ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్న అభిప్రాయం రాజకీయ, అధికార వర్గాల్లో వ్యక్తమవుతోంది. కాగా ఈ విషయమై వివరణ కోరేందుకు శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారైన ఆర్డీవో రవిశంకర్‌రెడ్డికి పలుమార్లు ఫోన్ చేసినా ఆయన స్పందించలేదు.


గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తికి జ్ఞాపికను అందిస్తున్న ఈవో వెంకటేశు - కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తికి జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి - ఆలయంలో ఆర్జేసీ చంద్రశేఖర్ ఆజాద్

వరసిద్ధుడి సేవలో న్యాయమూర్తులు

ఐరాల(కాణిపాకం),మార్చి 29: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని శుక్రవారం పలువురు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. వీరిలో.. గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేష్‌రాయ్, టీటీడీ లా ఆఫీసర్ వీర్రాజు, దేవదాయశాఖ రాష్ట్ర రీజనల్ జాయింట్ కమిషనర్ (ఆర్జేసీ) చంద్రశేఖర్ ఆజాద్ ఉన్నారు. అందరూ స్వామిని వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరందరికీ ఈవో వెంకటేశు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, దర్శన ఏర్పాట్లను చేసి, తీర్థప్రసాదాలు అందించారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వం పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ అవగాహనా సదస్సుకు విశేష స్పందన

తిరుపతి(విద్య), మార్చి 29: స్థానిక వరదరాజనగర్‌లోని విశ్వం టాలెంట్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన పాలిటెక్నిక్, ఎ.పి.ఆర్.జె.సి నమూనా ప్రవేశ పరీక్షకు, అవగాహనా సదస్సుకు విశేష స్పందన లభించిందని ఆ విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థినీ విద్యార్థులు హాజరై నమూనా పరీక్షలు రాశారని చెప్పారు. 2023 పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో విశ్వం విద్యార్థిని చరితశ్రీ 120కి గాను 119 మార్కులతో ప్రథమ ర్యాంకు సాధించిందని వెల్లడించారు. అలాగే ఏపీఆర్జేసీ ఫలితాల్లో తనూజ, భువనేశ్వర్ రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకులను సాధించారని వివరించారు. పాలిటెక్నిక్‌లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్స్, కంప్యూటర్ ఇంజినీరింగ్, మైనింగ్, కెమికల్, బయోమెడికల్ తదితర కోర్సులు ఉంటాయని, మెరుగైన ర్యాంకు సాధించడం ద్వారా మంచి కళాశాలలో సీట్లతోపాటు ఉపాధి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని వివరించారు. పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 27 ఉంటుందని, ఏప్రిల్ 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏపీఆర్జేసీ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 25వ తేదీన ఉంటుందని, మార్చి 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 86888 88802, 93999 76999లలో సంప్రదించాలని కోరారు.

12 మంది వలంటీర్ల రాజీనామా

గంగవరం,మార్చి 29 : మండలంలోని మామడుగు పంచాయతీకి చెందిన 12 మంది వలంటీర్లు సచివాలయ కార్యదర్శి హేమలతకు రాజీనామా లేఖలను అందించారు. మొత్తం 12 మంది వలంటీర్లు ఒకేసారి రాజీనామా చేయడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

● కడపకు చెందిన హరికృష్ణగా పోలీసుల అనుమానం


కల్లూరులో మృతి చెందిన వ్యక్తి మృతదేహం

కల్లూరు, మార్చి 29: కల్లూరు పట్టణంలో శుక్రవారం అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం... కల్లూరు నుంచి పులిచెర్లకు వెళ్లే రోడ్డుకు సమీపంలోని పొలంలో శుక్రవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు కల్లూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ తన సిబ్బందితో చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అతడి వయసు 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. మృతుడి తలపై గాయంతోపాటు మృతదేహానికి సమీపంలో రెండు రాళ్లపై రక్తపు మరకలు ఉండటాన్ని గుర్తించిన పోలీసులు హత్య జరిగి ఉండవచ్చన్నారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో కడప జిల్లాకు చెందిన హరికృష్ణగా పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి మృతదేహానికి శవ పరీక్ష నిమిత్తం పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ కేసును చేధించేందుకు రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని ఎస్ఐ తెలిపారు. ఎవరికైనా మృతుడి వివరాలు తెలిసే 9490617887, 9440796721 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పదం కాదు.. హత్యకేసుగా మార్చండి

రెండో రోజూ ధనుష్ బంధువుల ధర్నా ● అమ్మాయి తరపున నలుగురిపై కేసు నమోదు


వింజం బస్టాప్ వద్ద రోడ్డుపై టైర్‌కు నిప్పుపెట్టి ధర్నాకు దిగిన మృతుడి బంధువులు - సీఐ శంకర్‌కు వినతిపత్రం అందిస్తూ..

గంగాధరనెల్లూరు, మార్చి 29: గంగాధర నెల్లూరు మండలం వింజం దళితవాడకు చెందిన ధనుష్ మృతి కేసును అనుమానాస్పదం కాకుండా,హత్యకేసుగా మార్చాలంటూ మృతుడి కుటుంబీకులు, బంధువులు డిమాండు చేశారు. ఈ మేరకు శుక్రవారం వీరు ధర్నాకు దిగారు. ధనుష్ (19), వరత్తూరు పంచాయతీలోని ఓ అమ్మాయి ప్రేమించుకున్నారు. దళవాయిపల్లెకు సమీపంలో ఓ చెట్టుకు వేలాడుతున్న ధనుష్ మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. తొలుత ఆత్మహత్యగా భావించారు. మృతుడి తలకు గాయం ఉందంటూ గురువారం అతడి బంధువులు హత్య జరిగిందని భావించారు. హత్య కేసుగా నమోదు చేయాలని వింజం బస్టాప్ వద్ద రాస్తారోకో చేశారు. పోలీసులు చెప్పిన విషయాలతో వీరు ఏకీభవించక అమ్మాయి తరపున వారిపై హత్యకేసుగా నమోదు చేయాలని, పోస్టుమార్టం రిపోర్ట్ వెంటనే తెప్పించాలంటూ మళ్ళీ శుక్రవారం ఉదయం వింజం బస్టాప్ వద్ద ధర్నాకు దిగారు. రోడ్డుకు రెండువైపులా రాళ్ళు, చెట్టు తుండ్లను అడ్డంగా పెట్టేసి మృతుడు బంధువులు ధర్నాకు దిగారు. పోలీస్ ఉన్నతాధికారులకు సీఐ శంకర్ సమాచారం ఇచ్చారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మరో ముగ్గురు సీఐలు విశ్వనాథరెడ్డి, రవిశంకర్‌రెడ్డి, కుళ్ళాయప్ప, ఎస్ఐలు రామాంజనేయులు, నాగసౌజన్య, వెంకట సుబ్బమ్మ, కరీమున్నీసాతో పాటు 20మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. పోస్టుమార్టమ్ నివేదికతో పాటు ఫోన్‌కాల్స్ వివరాలు సేకరించుకుని తద్వారా కేసు విచారణలో ప్రమేయమున్న వారిపై కఠినచర్యలు తీసుకుంటామని పోలీసులు చెప్పినా వారు వినలేదు. ధనుష్ మృతి ఘటనలో ప్రత్యక్షసాక్షినంటూ వింజం దళితవాడకు చెందిన యువరాజు చెబుతూ.. తననుచూసి అమ్మాయి తరపున వారు పారిపోయారని రాతమూలంగా సీఐ శంకర్‌కు అర్జీ ఇచ్చారు. సాక్షిగా ముందుకొచ్చిన వ్యక్తి అర్జీని పరిగణనలోకి తీసుకుని విచారించి న్యాయంచేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. మధ్యాహ్నం నుంచి వాహనాల రాకపోకలు సాగాయి. ధనుష్ మృతదేహానికి సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ బాలచంద్రారెడ్డి, వింజం ఉపసర్పంచ్ చంద్రారెడ్డి, జనసేన కన్వీనర్ పొన్న యుగంధర్, టీఎన్ఎస్ఎఫ్ అధికార ప్రతినిధి కేతినేని లోకేష్‌నాయుడు, నేతలు నివాళులర్పించారు. ఆ తర్వాత పోలీసు బందోబస్తు నడుమ ధనుష్ అంత్యక్రియలు జరిగాయి. అమ్మాయి తరపు వారైన రవి, మదన్, కిరణ్, అమాసయ్యపై కేసు నమోదు చేసినట్లు సీఐ శంకర్ పేర్కొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు ప్రజలు సహకరించాలి: ఎస్పీ

చిత్తూరు, మార్చి 29: ప్రశాంత ఎన్నికలకు ప్రజలు సహకరించాలని ఎస్పీ జాషువా కోరారు. ఇందులో భాగంగానే జిల్లాలో రోజూ రోజు సాయుధ బలగాలతో కవాతును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే చిత్తూరు, కుప్పం, పలమనేరు, నగరి సబ్ డివిజన్ ప్రాంతాలకు ఎస్ఎస్‌బీ బలగాలను కేటాయించామన్నారు. శుక్రవారం చిత్తూరులో రెండో పట్టణ పరిధిలో సీఐ ఉలసయ్య ఆధ్వర్యంలో ఎస్ఐ ప్రసాద్‌తో కలిసి వివిధ కాలనీలు, ప్రధాన రహదారుల్లో కవాతు నిర్వహించారని శుక్రవారం ఒక ప్రకటనలో వివరించారు.

ఆలపాకంలో సాయుధ బలగాలతో కవాతు



విజయపురం, మార్చి 29: మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో శుక్రవారం కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించినట్టు ఎస్ఐ జయప్ప తెలిపారు. కళియంబాకం, బూచివానత్తం, ఆలపాకం గ్రామాల్లో కవాతు జరిగింది. ప్రజలు ఎన్నికల్లో తమ ఓటును నిర్భయంగా వేయాలని ఎస్ఐ కోరారు.

ఆకట్టుకున్న ఓట్ ఫర్ చిత్తూరు



సీతమ్స్ కళాశాలలో..

చిత్తూరు, మార్చి 29: జిల్లా ఎన్నికల ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా ఏఆర్వో, కమిషనర్ అరుణ ఆదేశాల మేరకు సీతమ్స్, ఎస్వీసెట్ ఇంజనీరింగ్ కళాశాలల్లోని యువ ఓటర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓట్ ఫర్ చిత్తూరు అంటూ ఇంగ్లీషు అక్షరాలతో యువ ఓటర్లు నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. స్వీప్ ఇన్‌చార్జి చిన్నయ్య, సభ్యులు పాల్గొన్నారు.

తమిళనాడు సరిహద్దులో తనిఖీలు



గొల్లమడుగు చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్న అధికారులు

గుడిపాల, మార్చి 29: చిత్తూరు- వేలూరు, బెంగళూరు - చెన్నై మార్గాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో ముమ్మరంగా తనిఖీలను నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఎంపీడీవో రాజశేఖర్ రెడ్డి, తనిఖీల అధికారి గణపతి ప్రతిఒక్క వాహనాన్నీ పరిశీలించారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి: సీపీఐ

చిత్తూరు రూరల్, మార్చి 29: మురకంబట్టులోని ఇందిరమ్మ కాలనీలో, ప్రశాంత్ నగర్, వైఎస్ఆర్ కాలనీల్లో పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలను రాజకీయ నేతల అండదండలతో కబ్జాకు పాల్పడుతున్న దళారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మహిళలని కూడా చూడకుండా లబ్ధిదారులపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. రూ.లక్షలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని చెప్పారు. దీనిపై కలెక్టర్, ఎస్పీ జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే సీపీఐ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు.

ద్విచక్ర వాహన చోరీపై ఫిర్యాదు

గుడిపాల, మార్చి 29: కమ్మతిమ్మాపల్లెలో గురువారం రాత్రి ద్విచక్ర వాహనం ఒకటి చోరీకి గురైందని పోలీసులకు ఫిర్యాదు అందింది. కమ్మతిమ్మాపల్లె క్రాస్‌లోని పెట్రోల్ బంకులో పంపు ఆపరేటర్‌గా పనిచేసే యోగేష్ విధులు ముగించుకుని తన ద్విచక్ర (బుల్లెట్) వాహనం పార్కింగ్ చేసిన చోటుకు వెళ్లి చూడగా కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శుక్రవారం ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బీపీఎంకి తీవ్రగాయాలు

శ్రీరంగరాజపురం, మార్చి 29: రోడ్డు ప్రమాదంలో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ (బీపీఎం) తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఎస్ఆర్‌పురం మండలం శెట్టివానత్తం బీపీఎం మేఘనాథరెడ్డి(56) ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం పళ్లిపట్టుకు వెళ్లి ఇంటికి తిరిగొస్తున్నాడు. మార్గమధ్యంలో నెలవాయి గ్రామం చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపైకి వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కుడికాలు విరిగింది. బాధితుడిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే చిన్న తయ్యూరుకు చెందిన వెంకటేష్ (45) పిళ్లారికుప్పం రోడ్డు నుంచి బైక్ ఇంటికి వస్తుండగా.. చిన్న తయ్యూరు వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటేష్‌కి కూడా తీవ్రగాయాలవగా, చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

చిత్తూరు, మార్చి 29: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రెండో పట్టణ సీఐ ఉలసయ్య తెలిపిన వివరాల మేరకు.. మురకంబట్టుకు చెందిన ఆనంద్(40) కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొద్దిరోజులుగా కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన ఆయన మద్యంలో పెయింట్‌ను కలిపి తాగడంతో మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెవెన్యూ అధికారులపై దౌర్జన్యం చేసిన తండ్రీకొడుకులపై కేసు నమోదు

చిత్తూరు, మార్చి 29: రెవెన్యూ అధికారులపై దౌర్జన్యానికి పాల్పడిన తండ్రీకొడుకులపై రెండోపట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఉలసయ్య తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని గొల్లవీధికి చెందిన అఫ్జల్ ఖాన్, అతడి కుమారుడు హర్షద్ ఖాన్‌లు బోడికొండ వద్ద ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేశారు. ఈ విషయంపై విచారణ చేపట్టాలని చిత్తూరు తహసీల్దార్ శ్రీనివాసులురెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో విచారణకు వెళ్లిన రెవెన్యూ సిబ్బందిపై తండ్రీకొడుకులు దౌర్జన్యం చేయడంతోపాటు తప్పుడు పత్రాలను చూపించారు. దీంతో వారిద్దరిపై నాలుగు సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు.

వైసీపీ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం

కల్లూరు, మార్చి 29: వైసీపీ ప్రభుత్వ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు రామనాథంనాయుడు, రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ విభాగం ప్రధాన కార్యదర్శి ముల్లంగి వెంకటరమణ తెలిపారు. పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ కొక్కువారిపల్లెలో శుక్రవారం టీడీపీ జయహో సభ, టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ పాలనలోనే బీసీలు అభివృద్ధి చెందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోవిందయ్య, మల్లెల సురేష్, మహేష్, రమేష్, దేవ, యర్రయ్య, సరస్వతి, గూకంటి నాగరాజు, రమణ, పార్థసారధి, బాబయ్య, నూర్‌భాషా, గౌనూర్ భాషా, ఈఎం రత్నం, సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

సోమలలో రూ.1.06 లక్షల సీజ్

సోమల, మార్చి 29: సోమల-తిరుపతి మార్గంలోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద శుక్రవారం బిల్లులు లేకుండా తీసుకు పోతున్న రూ.1.06 లక్షలు నగదును తనిఖీ అధికారులు సీజ్ చేసినట్లు ఎస్ఐ వెంకట నరసింహులు తెలిపారు. పీలేరు పట్టణం హరినాథ్‌పురానికి చెందిన గౌస్‌పీర్ బొలెరో వాహనంలో ఎలాంటి బిల్లులు లేకుండా రూ. 1.06 లక్షలు నగదును తీసుకొస్తుండగా పోలీసులు నగదును గుర్తించి సీజ్ చేశారు. హెచ్‌సీలు దేవరాజులు, నగేశ్, బాలచంద్ర పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే వలంటీర్లను బెదిరిస్తున్న విజయానంద రెడ్డి

తెలుగు యువత

చిత్తూరు సిటీ, మార్చి 29: ఓటమి భయంతోనే వలంటీర్లను చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి బెదిరిస్తున్నారని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి వరుణ్ కుమార్ ఆరోపించారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. సొంత పార్టీ కార్యకర్తలపై నమ్మకం లేక వలంటీర్లతో రాజీనామా చేయించి తనకోసం ప్రచారం చేయాలని బెదిరిస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న వలంటీర్ల రాజీనామాలను ఎన్నికల కమిషన్ సుమోటోగా స్వీకరించి చర్యలు చేపట్టాలని కోరారు. కాగా, టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థను తొలగిస్తుందని అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. వలంటీర్లకు తాము వ్యతిరేకం కాదన్న విషయాన్ని అనేక బహిరంగ సభల్లో టీడీపీ అధినేత చంద్రబాబు చెప్పారని గుర్తుచేశారు.

డ్రగ్స్ కేంద్రంగా రాష్ట్రాన్ని మార్చేసిన వైసీపీ

- చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్

చిత్తూరు రూరల్, మార్చి 29: వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని డ్రగ్స్ కేంద్రంగా మార్చేశారని చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ అన్నారు. శుక్రవారం చిత్తూరు రూరల్ మండలంలోని బీఎన్ఆర్ పేట, అనంతాపురం, కుర్చివేడు, పాలూరు గ్రామ పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లలో రాష్ట్రాన్ని వైసీపీ ప్రభుత్వం 20 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లిందని విమర్శించారు. ఎక్కడ చూసినా గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా దొరుకుతున్నాయని వాపోయారు. మరోవైపు పెరిగిన నిత్యావసరాల ధరలతో పేదలు రెండు పూటలా కడుపునిండా తినలేకపోతున్నారని చెప్పారు. ఈ పాపమంతా జగన్‌కే తగులుతుందని అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపిస్తే రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. టీడీపీ మాజీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్రకాష్ మాట్లాడుతూ.. మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తే ఏపీ మరో శ్రీలంక అవ్వడం ఖాయమన్నారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ.. ఇసుక, మద్యం, గంజా అక్రమ రవాణాలో దేశంలో రాష్ట్రానికి మొదటి స్థానం దక్కిందని, అభివృద్ధిలో మాత్రం చివరి స్థానంలో ఉందని విమర్శించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, మాజీ మేయర్ కఠారి హేమలత, కాజూరు బాలాజి, జిల్లా కార్యదర్శి జయచంద్రనాయుడు, మోహన్‌రాజ్, శశికర్‌బాబు, రఘు, మేషాక్, నీలకంఠంనాయుడు, దేవరాజులు నాయుడు, దయారాం, పుష్పావతి, మోహన్‌నాయుడు, హరిబాబు చౌదరి, వెంకటేష్, దిలీప్, శ్యామ్, ప్రకాష్, రామూర్తి, ఆనందనాయుడు, మనోహర్‌నాయుడు, నయాజ్, జాఫర్, యోగమూర్తి తదితరులు పాల్గొన్నారు.



త్యాగరాజు నాయుడిని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

టీడీపీలో చేరిన వైసీపీ నేత

చిత్తూరు రూరల్ మండలానికి చెందిన వైసీపీ కీలక నేత శెట్టింతగల్‌కు చెందిన త్యాగరాజు నాయుడు టీడీపీలో చేరారు. గురజాల జగన్మోహన్, చంద్రప్రకాష్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే మనోహర్‌నాయుడులు ఆయనకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో చిత్తూరు రూరల్ మండలంలో వైసీపీ ఇంకా బలహీన పడనుంది.

టీడీపీ పాలనలోనే బీసీల అభివృద్ధి

బంగారుపాళ్యం, మార్చి 29: టీడీపీ పరిపాలనలోనే బీసీల అభివృద్ధి జరిగిందని చిత్తూరు పార్లమెంటు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ అన్నారు. శుక్రవారం మండలంలోని కీరమంద, కేజీసత్రం, పెరుమాళ్లపల్లె క్లస్టర్లలో జయహో బీసీ సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. జగన్‌రెడ్డి రాష్ట్రంలో హిట్లర్ పాలన సాగిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా బూరగమానూరుకు చెందిన 10 కుటుంబాల ఎస్టీలు కీరమందలో జరిగిన సమావేశంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. కేజీ సత్రం వద్ద జరిగిన సమావేశంలోనూ బోడబండ్లకు చెందిన 50 మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్, మండల అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్, మాజీ ఏఎంసీ ఛైర్మన్ జయచంద్ర నాయుడు, చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జిలు ఎన్పీ ధరణీ నాయుడు, కోకా ప్రకాష్ నాయుడు, అనిల్, రాష్ట్ర కల్లుగీత కార్మిక కార్యదర్శి బుస్సా నాగరాజ గౌడ్, కల్లుగీత కార్మిక మాజీ డైరెక్టర్లు మహేంద్ర, నీరజాక్షులు గౌడ్, మండల బీసీసెల్ అధ్యక్షుడు జానకిరామ్, జిల్లా బీసీసెల్ కార్యదర్శి హరిప్రసాద్, మాజీ జడ్పీటీసీ కళావతి, జనసేన నేత శాంతామూర్తి, బీజేపీ శ్రేణులు పాల్గొన్నాయి.



కీరమందలో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న దగ్గుమళ్ల ప్రసాదరావు







జీసస్ బ్లెస్సింగ్ చర్చిలో చిన్నారులు ప్రదర్శిస్తున్న నాటిక - చిత్తూరులో, వెదురుకుప్పం మండలం దేవరగుడిపల్లెలో శిలువతో ప్రదర్శన

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

చిత్తూరు కల్చరల్, మార్చి 29: నగరంలోని చర్చివీధిలోని టౌన్ చర్చిలో గుడ్ ఫ్రైడేని క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మేయర్ అముద పాల్గొన్నారు. పలమనేరు రోడ్డులోని క్యాథలిక్ చర్చిలో ప్రార్థనలయ్యాక శిలువలను చేతబూని ప్రదర్శన నిర్వహించారు. చెన్నమ్మగుడిపల్లె పీపుల్స్ చర్చిలో పాస్టర్ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి.

విజయపురం: మాధవరం, ఆలపాకం, పన్నూరు, విజయపురం, జీఎంపురం, కేవీపురం, ఇళ్లత్తూరు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థన చేశారు.

పాలసముద్రం: వెంగళరాజుకుప్పం, దీనబంధుపురం, వీర్లగుడి, ఆముదాల, బాలకృష్ణాపురం, బలిజకండ్రిగ, తిరుమలరాజుపురం గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పూతలపట్టు: పూతలపట్టు, నాగిరెడ్డిపల్లి, అనంతాపురం, రంగంపేట క్రాస్‌రోడ్డు తదితర గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

కార్వేటినగరం: బీసీ కాలనీ క్రైస్తవ ప్రార్థనా మందిరంలో పాస్టర్ ఆశీర్వాదం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నగరి: పట్టణం, మండల పరిధిలోని చర్చిల్లో క్రైస్తవులు విశేష పూజలు నిర్వహించారు.

బంగారుపాళ్యం: మాధవనగర్‌లోని జీసస్ బ్లెస్సింగ్, నలగాంపల్లె లూక్స్, ముంగరమడుగు, కరిడివారిపల్లె, తగ్గువారిపల్లెలోని లైఫ్ ఆఫ్ మినిస్ట్రీ, బంగారుపాళ్యం సీఎస్ఐ చర్చిలో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జీసస్ బ్లెసింగ్ చర్చిలో చిన్నారులు గుడ్ ఫ్రైడే ప్రాముఖ్యాన్ని నాటిక రూపంలో ప్రదర్శించారు. పాస్టర్ యోవాన్, పాస్టర్ కిరణ్‌బాబు, పాస్టర్ శామ్యూల్, పాస్టర్ జాన్, పాస్టర్ గోవిందయ్య, పాస్టర్ జీవన్ బాబు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: దేవరగుడిపల్లెలోని సీఎస్ఐ సెయింట్ మాథ్యూస్ చర్చిలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఏసుక్రీస్తు వేషధారణలో శిలువను మోస్తూ నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. సంఘ కాపరి రెవరెండ్ అన్బుదాస్, ఉపదేశకులు, మిషనరీలు, సెక్రటరీ, ట్రెజరర్ పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే టీడీపీ ధ్యేయం / 'తెలుగుదేశం' ఆవిర్భావ దినోత్సవంలో నాయకులు

టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఆ పార్టీ శ్రేణులు వాడవాడలా ఘనంగా నిర్వహించాయి. పలుచోట్ల ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. కేక్ కట్ చేసి, పేదలకు అన్నదానం చేశారు. పేదల అభ్యున్నతే టీడీపీ ధ్యేయమని నాయకులు పేర్కొన్నారు.

పాలసముద్రం, మార్చి 29: టీడీపీ కార్యాలయంలో కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు శేఖర్ రాజు, వాసు నాయుడు, రవి నాయుడు, జె.విజయ్‌కుమార్, సాంబశివన్, అరుళ్‌నాథన్, వాసు, ఉమాపతి పాల్గొన్నారు.

పూతలపట్టు: అంబేడ్కర్ సర్కిల్ వద్ద జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, నాయకులు గిరిధర్ బాబు, హిమగిరి నాయుడు, ప్రతాపనేని చంద్రమౌళి, ఊట్ల నాగరాజు నాయుడు, రామానుజం, జగన్నాథం, సుబ్బరాజులు, హరి, గణపతి నాయుడు, చిరంజీవి, రజిని, హేమాద్రి, నాగయ్య, దాము, వీరభద్రయ్య, రామూర్తి నాయుడు, మధు, హిమకర్ నాయుడు, దగ్గుపాటి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు బాబు నాయుడు, విశ్వనాథ్ నాయుడు, సిద్దయ్యశెట్టి, పుల్లూరుబాబు, నీరంజన్‌రెడ్డి, దొడ్డ హేమాద్రి యాదవ్, మణి, భాస్కర్ నాయుడు, చంద్రబాబురెడ్డి, జలంధర్ నాయుడు, సోమేశ్వర్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు, జనసేన నేత చందు పాల్గొన్నారు.

ఐరాల: పేరయ్యగారిపల్లె వద్ద జరిగిన ఐరాల టీడీపీ అధ్యక్షుడు వడ్డపాటిగిరిధర్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు దయానందమండడి, కొల్లా రమేష్, చౌదరి, బాలసుబ్రహ్మణ్యం, బాబు నాయుడు, సొప్పా నాని పాల్గొన్నారు.

తవణంపల్లె: మండలంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు గాలి దిలీప్‌కుమార్, మాజీ జడ్పీటీసీలు వెంకటేష్ చౌదరి, కోదండయ్య, స్థానిక సర్పంచ్ ధనలక్ష్మి, క్లస్టర్ ఇన్‌చార్జి సునీల్‌కుమార్, టీడీపీ నాయకులు జెట్టిపల్లె శ్రీనువాసులు, శరవణ, చిట్టెమ్మ, ప్రకాష్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నింద్ర: టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, రవికుమార్, గాలి రమేష్‌నాయుడు, సంపూర్ణమ్మ, జగన్, కోటేశ్వరరావు, ప్రకాష్, ఉమాపతి పిళ్లై, ప్రసాద్ రెడ్డి, ప్రసన్నకుమార్, కాటయ్య తదితరులు పాల్గొన్నారు.

నగరి: టీడీపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి కార్యదర్శి శ్రీనివాసన్, రాష్ట్ర మహిళా అధికారప్రతినిధి మీరా, నాయకులు అల్లిముత్తు, బాబుభాయ్, సికిందర్‌భాయ్, మదివాసన్, వీకేఎస్‌వాసు, బీపీ ఆర్ముగం, సురేష్‌నాయుడు, టీఎన్‌టీయూసీ బాలాజి, జయపాల్, గుణశేఖర్, జ్యోతినాయుడు, రుక్కుం బాలాజీ, కన్నెప్పనాయుడు,సంగీత, తదితరులు పాల్గొన్నారు.




బంగారుపాళ్యంలో టీడీపీ జెండాను ఆవిష్కరిస్తున్న సీఆర్ రాజన్ తదితరులు

గుడిపాల: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, కార్యదర్శి కిట్టు, నాయకులు రవి నాయుడు, బాలసుబ్రహ్మణ్యం యాదవ్, ఆనంద్ యాదవ్, చల్లా, పృథ్వి, శంకర్ చౌదరి, సురేంద్ర బాబు, దొరబాబు, చందు రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్, చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్, మండల అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్ నాయకులు ఎన్పీ జయచంద్రనాయుడు, ఎన్పీ ధరణీ నాయుడు, కోదండ యాదవ్, రామభద్ర నాయుడు, కమల్‌నాథ రెడ్డి, జనార్దన్ గౌడ్, లోకనాథం నాయుడు, బాలకృష్ణ, నీరజాక్షులు గౌడ్, మునిరత్నం పాల్గొన్నారు.

వరి పొలాలకు అడవి పందుల బెడద



వరి పొలం చుట్టూ రక్షణగా చీరలు

సోమల, మార్చి 29: వరి పొలాల్లో అడవి పందులు స్వైరవిహారం చేస్తూ రైతుల కంట కన్నీరు తెప్పిస్తున్నాయి. గురువారం రాత్రి సోమల తిరుపతి గంగమ్మ ఆలయం సమీప వరి పొలంలో అడవి పందులు ప్రవేశించి ఎన్ను వస్తున్న పంటలో తిరగాడి నష్ట పరిచాయి. రాత్రి రైతులు పొలం వద్ద కాపుకాస్తున్నా ఏదో సమయంలో వచ్చి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. పొలం చుట్టూ పాత చీరలు, సౌండ్ సిస్టమ్స్ ఏర్పాటు చేసినా ఫలితం లేకపోతోంది. సోమల, అడుసుపల్లె, ఇరికిపెంట, సూరయ్యగారిపల్లె, నెల్లిమంద, నడిండపల్లె, చిన్నఉప్పరపల్లె తదితర ప్రాంతాల్లో అడవి పందుల బెడద తీవ్రంగా ఉంది. వీటికి తోడు వడ్డిపల్లె, చెన్నయ్యగారిపల్లె, భారతం మిట్ట, కరకమంద ప్రాంత పొలాల్లోకి దుప్పులు వస్తున్నాయని రైతులు తెలిపారు.

వైసీపీ ప్రలోభాలకు ఆశపడకండి : గౌనివారి

శాంతిపురం, మార్చి 29: ఎన్నికల సమయంలో వైసీపీ అందించే తాయిలాలకు ఆశపడి బిడ్డల జీవితాలు నాశనం చేసుకోవద్దని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్యకర్త 40 రోజులు శ్రమించి చంద్రబాబు కు లక్ష మెజార్టీ తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నేతలు ఉదయ్ కుమార్, విజయరామిరెడ్డి, ఉయ్యాల జయరామి రెడ్డి, ఆర్ఎస్ మణి, చంద్రశేఖర్, ఎంసీ నాగరాజు, ఆంజనేయ రెడ్డి, పివి నాగరాజు, అనసూయ, శ్యామల, చంద్రకళ, సుగుణమ్మ, రూప తదితరుల నాయకులు పాల్గొన్నారు.

'చెల్లెళ్లకే న్యాయం చేయలేనోడు జగన్'

గంగాధరనెల్లూరు, మార్చి 29: 'చెల్లెళ్లయిన షర్మిల, సునీతలకే న్యాయం చేయలేనోడు సీఎం జగన్. ఇటువంటి వ్యక్తి రాష్ట్రాన్ని ఉద్ధరిస్తాడట' అని పార్లమెంట్ టీఎన్ఎస్ఎఫ్ అధికార ప్రతినిధి కేతినేని లోకేష్‌నాయుడు, టీడీపీ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి కామసాని కోదండరెడ్డి, సింగిల్‌విండో సొసైటీ మాజీ డైరెక్టర్ కామసాని విజయకుమార్‌రెడ్డి, టీఎన్‌టీయూసీ నియోజకవర్గ ప్రధానకార్యదర్శి బోడిరెడ్డి రుషేంద్రరెడ్డిలు ధ్వజమెత్తారు. ఈసారి ఎన్నికల్లో కుటుంబంలో ఎవరిని చంపేసి లబ్ధి పొందడానికి కుట్రలు పన్నుతున్నారో అని ఒక ప్రకటనలో విమర్శించారు.

భానుడి భగభగలతో అల్లాడుతున్న జనం



గంగాధర నెల్లూరులో బాలుర హాస్టల్ ముందు మధ్యాహ్నమయ్యేసరికి నిర్మానుష్యంగా ఉన్న చిత్తూరు-పుత్తూరు రోడ్డు

గంగాధరనెల్లూరు, మార్చి 29: భానుడి భగభగలతో గంగాధర నెల్లూరు మండలంలోని ప్రజలు అల్లాడిపోతున్నారు. శుక్రవారం కూడా ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఎండ వేడిమికి జనం ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయపడ్డారు.

వరసిద్ధుడి ఆలయానికి రూ.1.80 లక్షల విరాళం



ఐరాల(కాణిపాకం), మార్చి 29: స్వయంభు కాణిపాక వరసిద్ధుడి ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి వడ్రాంపల్లెకు చెందిన గురజాల ఉమాపతి నాయుడు రూ.1.00.116, గోసంరక్షణ ట్రస్టుకు రూ.80,000 శుక్రవారం విరాళంగా అందించారు. దాతను ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పత్తిపాటికి గీతాంజలి స్మారక పురస్కారం



రాజేంద్రనాయుడు

చిత్తూరు కల్చరల్, మార్చి 29: చిత్తూరు జిల్లాలోని ప్రముఖ గద్య, పద్య సాహితీవేత్త పత్తిపాటి రాజేంద్రనాయుడికి గీతాంజలి స్మారక పురస్కారం అందించనున్నట్లు నవ్యాంధ్ర రచయిత్రుల (నరసం) జిల్లా అధ్యక్షురాలు కరణం విమల తెలిపారు. ఏప్రిల్ ఏడో తేదీన పలమనేరులో తెలుగుసాహితీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో ఆయనకు పురస్కారం ప్రదానం చేయనున్నట్లు ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో హోటల్ యజమాని ఆత్మహత్య



బాలగంగాధర్‌తిలక్ (ఫైల్‌ఫొటో)

పుంగనూరు రూరల్, మార్చి 29: కుటుంబ కలహాలతో ఓ హోటల్ యజమాని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం పుంగనూరులో చోటుచేసుకుంది. కుటుంబీకుల కథనం మేరకు ... పుంగనూరు కొత్తపేటకు చెందిన బాలగంగాధర్‌తిలక్‌నాయుడు(56) కొత్తపేట క్రాస్‌లో హోటల్ నిర్వహిస్తున్నాడు. ఇతడికి ఇద్దరు కుమార్తెలు పెద్దకుమార్తె లిఖిత, చిన్న కుమార్తె వినిత ఇద్దరికి వివాహం చేశారు. చిన్న కుమార్తె వినితకు ఏడాది క్రితం సమీప బంధువైన పెద్దపంజాణికి చెందిన జ్యోతిష్‌నాయుడుకు ఇచ్చి వివాహం చేశారు. అయితే జ్యోతిష్‌నాయుడు వైజాక్‌లో బిల్డర్‌గా వ్యవహరిస్తున్నట్లు అత్త, మామ, భార్యను నమ్మించి మోసం చేసినట్లు ఆరోపించారు. ఇటీవల డబ్బు అవసరమని రూ. 30లక్షలు తీసుకున్నప్పటికీ తిరిగి భార్యను ప్రతిరోజు డబ్బు కోసం వేధించడంతో పుట్టినిల్లు చేరింది. కుటుంబంలో గొడవలు జరగడంతో మనస్థాపానికి గురైన బాలగంగాధర్ రాత్రి స్థానిక మార్కెట్‌యార్డులోని ఓ చెట్టుకు తాడుతో ఊరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం కుటుంబసభ్యులు బాలగంగాధర్ ఇంటిలో లేకపోవడంతో చుట్టుపక్కల వెతకడంతో స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబసభ్యులు చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని కిందకు దింపారు. ఎస్ఐ సుబ్బారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతిపై ఆరా తీసి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

గంగవరం, మార్చి 29 : కర్ణాటక నుంచి గంగవరం మీదుగా మద్యం తరలిస్తున్న ఒకరిని అరెస్ట్ చేసి మద్యం సీజ్ చేసినట్లు సీఐ చిన్నగోవిందు తెలిపారు. శుక్రవారం నిందితులను అరెస్ట్ చూపి వివరాలను వెల్లడించారు. పసపత్తూరు క్రాస్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా కురపల్లెకు చెందిన ప్రకాష్‌బాబు ద్విచక్ర వాహనంపై వెనుక ఓ ప్లాస్టిక్ సంచెను పెట్టుకొని వస్తుండగా, అనుమానం వచ్చి పరిశీలించారు. ఈ తనిఖీల్లో కర్ణాటకకు చెందిన మూడు కేసుల మద్యం బయటపడింది. దీంతో మద్యం తరలిస్తున్న ప్రకాష్‌బాబును అరెస్ట్ చేసి స్వాధీనం చేసుకున్న మద్యం, ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసి కోర్టుకు హాజరుపరచామని సీఐ తెలిపారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

పలమనేరు, మార్చి 29: డిప్లొమా కోర్సుల ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినులకు పలమనేరు మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ మొహమ్మద్ తెలిపారు. పాలిసెట్-2024 పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినులకు ఏప్రిల్ 1నుంచి 24వ తేది వరకు శిక్షణ ఇచ్చి ఉచితంగా స్టడీ మెటీరియల్స్ అందజేస్తున్నట్లు తెలిపారు. పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 5వ తేదీ వరకు గడువు ఉందన్నారు.

గాయపడ్డ వ్యక్తి మృతి



చౌడేపల్లె, మార్చి29: ఈనెల 22న రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. చారాల సమీపంలో ఈనెల 22న ఓ వాహనం గుర్తుతెలియని వ్యక్తిని ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ వ్యక్తిని 108 వాహనంలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే 94409 00698 నెంబరుకు సమాచారం అందించాలని కోరారు.